క్లుప్తంగా

సైబర్ నేరాలపై జాగ్రత్త తప్పనిసరి

మహబూబాబాద్ రూరల్/గూడూరు/దంతాలపల్లి/పెద్దవంగర/డోర్నకల్/నెల్లికుదురు: సైబర్ నేరాలపై ప్రజలు జాగ్రత్త వహించాలని, అపరిచిత ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు స్పందించవద్దని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ బుధవారం తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట, గూడూరు మండల కేంద్రాల్లో సైబర్ నేరగాళ్ల ఘరానా మోసాలు బయటపడ్డాయని, ఏఎస్సై అంటూ ఫోన్ చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు ఫోన్ పే చేయించుకున్న విషయం అందరికి తెలిసిందే అన్నారు. అందువల్ల పోలీసులని ఫోన్ చేసి డబ్బులు పంపమంటే ప్రజలు ఎవరు కూడా పంపి మోసపోవద్దని సూచించారు. సైబర్ నేరస్తుల వలలో చిక్కి డబ్బులు పోగొట్టుకోవద్దని, ఎవరైనా ఆ విధంగా ఫోన్ చేసినట్లయితే వెంటనే 1930 ఫోన్ చేసి తెలపాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

మరిపెడ/దంతాలపల్లి/మరిపెడ రూరల్: జిల్లా కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో బుధవారం జరిగిన జీవశాస్త్ర ప్రతిభ పరీక్షలో మరిపెడ హైస్కూల్ విద్యార్థి సోనియా, దంతాలపల్లి జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన విద్యార్థిని జ్యోత్స్న, మరిపెడ రూరల్ మండలంలోని వీరారం హైస్కూల్‌కు చెందిన విద్యార్థి శ్రీకాంత్ ద్వితీయ స్థానం పొంది రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

జాతీయస్థాయి క్రీడలకు..

మహబూబాబాద్ అర్బన్: సంగారెడ్డి జిల్లాలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 తైక్వాండో పోటీల్లో మానుకోట లయన్ క్రీడాకారులు పాల్గొని బంగారు పతకాలు సాధించారని కోచ్ రాంబాబు బుధవారం తెలిపాడు. ఎంపికైన సంజయ్, ప్రసాద్, నిఖిల్ ముగ్గురు క్రీడాకారులు ఈనెల మధ్యప్రదేశ్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు.

స్విమ్మింగ్ పోటీలకు..



మహబూబాబాద్ రూరల్: జేఎన్‌టీయూ హైదరాబాద్ సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలకు మండలంలోని అయోధ్య గ్రామానికి చెందిన మొగుళ్ల నేహా ఎంపికైంది. అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డుపల్లి ఉపేంద్రం మాట్లాడుతూ.. తమిళనాడులో ఈనెల 21నుంచి 23 వరకు జరగనున్న పోటీల్లో రాణించి విజయం సాధించాలన్నారు.

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



గార్ల: గార్ల ఎస్సైగా ఎస్కె రియాజ్‌పాషా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ పనిచేసిన ఎస్సై ఎన్.జీనత్‌కుమార్ మహబూబాబాద్ ఎస్పీ ఆఫీస్‌కు వెళ్లారు.

వ్యక్తిపై కేసు నమోదు

డోర్నకల్: 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సమయాన్ని వృధా చేసిన వ్యక్తిపై డోర్నకల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బి.రాజేష్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లబండతండాకు చెందిన గుగులోత్ భాస్కర్ మద్యం తాగి 100 నంబర్‌కు పదేపదే ఫోన్ చేస్తూ బ్లూ కోల్ట్స్ సిబ్బందికి అడ్రస్ చెప్పకుండా విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. దీంతో భాస్కర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆర్థికసాయం

గార్ల: గార్ల సీహెచ్‌సీలో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న ఎస్కె షకీరాబేగం కొంతకాలంగా కిడ్నీ సంబంధిత డయాలసిస్ సమస్యతో బాధపడుతుండగా, తోటి ఆరోగ్యమిత్రలు కలిసి బుధవారం రూ.48వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా టీం లీడర్ కందికట్ల సంతోష్, జిల్లా అధ్యక్షుడు రాసాల శ్రీనివాస్, కార్యదర్శి భీమిశెట్టి శ్రీనివాస్, యాకూబ్, రాము, విజయ్ పాల్గొన్నారు.

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: నాలుగున్నర క్వింటాళ్ల నల్లబెల్లం, 10 కిలోల పటిక పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై విదీపికరెడ్డి బుధవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామ శివారులో గల రైల్వేగేట్ సమీపంలో నలుగురు వ్యక్తులు ఒక ద్విచక్ర వాహనంతో నిలబడి ఉండగా వారి వద్ద నాలుగున్నర క్వింటాళ్ల నల్లబెల్లం, 10కిలోల పటిక లభ్యమైందన్నారు. నల్లబెల్లం సరఫరా చేస్తున్న బాదావత్ మాన్ సింగ్, సపావత్ సంతు, బాదావత్ సురేష్, బానోతు హనుమాన్ పై కేసు నమోదు చేశామని తెలిపారు. వారి వద్ద గల స్కూటీ వాహనాన్ని సీజ్ చేశామని, నల్లబెల్లం విలువ రూ.1.81లక్షలు ఉంటుందన్నారు

నిధులు కేటాయించాలి



డోర్నకల్: డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధుల కేటాయించాలని బుధవారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రామసహాయం సురేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

- రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

- మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
- మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ



హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్‌ఆఫ్ చేయడం మంచిది.

స్థానిక ఎన్నికల్లో సత్తా చూపాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి



మాట్లాడుతున్న విజయసారథి

కేసముద్రం: వచ్చే స్థానిక ఎన్నికల్లో కమ్యూనిస్టులు సత్తా చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, పార్టీ నియోజవకర్గ కార్యదర్శి బి.అజయ్‌సారథి అన్నారు. బుధవారం మండలంలోని అమీనాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఐ మండల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ సర్కార్ మతతత్వ విధానాలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ పాలన సాగిస్తుందన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా కేంద్ర ప్రభుత్వం దాటవేస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రజాసమస్యలను పాలకులు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, పెరుగు కుమార్, వెంకన్న, మంద భాస్కర్, ఉపేందర్, కొమురయ్య, సోమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయని అధికారులు



నిరసన తెలుపుతున్న కమిటీ సభ్యులు

నెల్లికుదురు: మండలంలోని నైనాల ఎంపీ యూపీఎస్ పాఠశాలకు ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రామరాజు కవిత కోరారు. ఈ మేరకు స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు జి.రాజన్న స్టడీ ఆన్‌లీవ్ డీఈఓ ఉత్తర్వుల ప్రకారం డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు తెలిపారు. అప్పటి నుంచి మూడు నెలలుగా 7 క్లాసులున్న పాఠశాలకు ఇప్పటి వరకు ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయలేదన్నారు. ఎంఈఓ స్పందించి వెంటనే చర్య తీసుకోవాలని లేకుంటే డీఈఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిర్రరమ, వద్దోలు రేణుక, మంజుల, సారమ్మ, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



గార్ల: పినిరెడ్డిగూడెం గ్రామంలో సర్వే చేస్తున్న నాయకులు

గార్ల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ నాయకుడు కందునూరి శ్రీనివాసరావు కోరారు. సీపీఎం ఆధ్వర్యంలో గార్ల, సీతంపేట, పినిరెడ్డిగూడెం గ్రామాల్లో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అలువాల సత్యవతి, రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఎం మండల కార్యదర్శి ఎండీ యాకుబ్ అన్నారు. బుధవారం మండలంలోని గుర్తూరు, జమస్తాపురం గ్రామాల్లో సర్వే నిర్వహించారు.

కేసముద్రం: మండల కేంద్రంలోని కట్టుకాల్వతండాలో పలు సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించారు.

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



ప్రశాంత్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మహబూబాబాద్ రూరల్: ఆటో డ్రైవర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో కిరాయికి తీసుకెళ్లిన వ్యక్తి ఇంటి ఎదుట డ్రైవర్ మృతదేహంతో కుటుంబ సభ్యులు బుధవరాం ఆందోళన చేశారు. వివరాలు.. మండలంలోని దర్గాతండా జీపీ పరిధిలోని లాక్యతండాకు చెందిన బానోత్ ప్రవీణ్ (25) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రవీణ్ ఇంటి ఎదుట నివాసం ఉండే గుగులోత్ ప్రశాంత్ మంగళవారం ఖమ్మం వెళ్లేందుకు ఆటో కిరాయికి వస్తావా అని ఆటో డ్రైవర్ ప్రవీణ్ అడిగాడు. దీంతో ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం రుక్కితండా స్టేజీ సమీపంలోకి వెళ్లగా చత్తీస్‌గఢ్ నుంచి వస్తున్న తుఫాన్ వాహనం ఆటోను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కాగా ప్రవీణ్ మృతిచెందిన విషయాన్ని అతడి కుటుంబ సభ్యులకు, తండావాసులకు ప్రశాంత్ చెప్పలేదని ఆరోపించారు. తమకు తాముగా తెలుసుకుని సంఘటన స్థలానికి వెళ్లామన్నారు. మృతుడు ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు



ఎక్సైజ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గూడూరు: మండల కేంద్రంలో ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న మద్యం హోల్‌సేల్ దుకాణాన్ని వెంటనే సీజ్ చేయాలని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్, పట్టణ అధ్యక్షుడు చీదురు వెంకన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా స్థానిక మద్యం దుకాణాలను యజమానులు కొనసాగిస్తున్నారని, మద్యం ప్రియులు అధిక ధరలు వెచ్చింది బెల్టు షాపులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రహీం, సంపంగి రాములు, వెంకన్న, భూక్య సురేష్, భిక్షపతి, ఎల్లయ్య పాల్గొన్నారు.

పెద్ద వైద్యుడికి చూపిస్తానని మోసం

ఎంజీఎం: మంచి వైద్యులకు చూపిస్తానంటూ నమ్మబలికి వృద్ధురాలిని మోసం చేశాడో అపరిచితుడు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు బత్తోజు విమలమ్మ చికిత్స కోసం బుధవారం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రి ప్రాంగణంలో ఓ వ్యక్తి ఆమెతో మాట కలిపాడు. మీదీ మాదీ ఒకే ఊరు అని చెప్పాడు. పెద్ద వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చూపిస్తానంటూ వృద్ధురాలి నుంచి మొదట రూ.500 తీసుకున్నాడు. అనంతరం మీ బిడ్డకు ఫోన్ పే చేస్తానని చెప్పి మరో రూ.500 తీసుకుని పరారయ్యాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అక్కడే చెట్టు కింద కూర్చొని దిగాలుగా ఉన్న విమలమ్మను ఆర్‌ఎంఓలు శ్రీనివాస్, శశి గమనించి ఏం జరిగిందని ఆరా తీశారు. జరిగిన విషయాన్ని వృద్ధురాలు ఆర్‌ఎంఓలకు వివరించింది. అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించి వృద్ధురాలిని మోసగించిన వ్యక్తి మాస్క్ వేసుకుని వృద్ధురాలిని మోసం చేసినట్లు అధికారులు గుర్తించారు. ఎంజీఎంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఆర్‌ఎంఓ శ్రీనివాస్ తెలిపారు.

అధ్యక్షుల నియామకం

కురవి: మండలంలోని నేరడ శివారు రాయినిపట్నం, లింగ్యాతండా గ్రామాలలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షుల నియామకాలను కురవి మండల సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జ్ చీకటి మహేష్ గౌడ్ బుధవారం అందజేశారు. లింగ్యాతండా 56వ బూత్ అధ్యక్షుడిగా లావుడ్య రమేష్, రాయినిపట్నం 40వ బూత్ అధ్యక్షుడిగా కోల వెంకన్న గౌడ్‌లకు నియామక పత్రాలను అందజేశారు. శ్రీరామోజు నాగరాజు, పెంటయ్య, సోమ రమేశ్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కురవి: కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ 2025న అమలులోకి తీసుకురానున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్స్(యూపీఎస్)కి వ్యతిరేకంగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో ఈనెల 22న వరంగల్‌లో తలపెట్టిన కాకతీ కదనభేరీ వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా అధ్యక్షులు పూసపాటి నాగముణి, రాష్ట్ర కార్యదర్శి ఆవునూరి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు సారంగపాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఎంటీఏ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉపేందర్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కీర్తనారెడ్డి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంగీత, నాగేశ్వర్‌రావు, సౌజన్య, ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



చిన్నగూడూరు: సర్వే చేస్తున్న అధికారులు, కమిటీ సభ్యులు

చిన్నగూడూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు, కమిటీ సభ్యులు పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రామారావు అన్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు బుధవారం మండల కేంద్రంలో చేపడుతున్న సర్వేను ఎంపీడీఓ పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి తప్పులకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులకు, కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ప్రమోద్ రెడ్డి, నర్సయ్య, అధికారులు భాస్కర్, మల్లేష్, వీరన్న పాల్గొన్నారు.

సర్వే పాదర్శకంగా జరగాలి

మహబూబాబాద్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు పారదర్శకంగా నిర్వహించి, అర్హులకు న్యాయం చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న అన్నారు. 24వ వార్డు పరిధిలోని లెనిన్ నగర్ కాలనీలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను అధికారులు చేసి వివరాలను యాప్‌లో నమోదు చేశారు.

ఉపాధ్యాయుల కృషితో అభ్యసనశక్తి

డోర్నకల్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కృషితో విద్యార్థుల్లో అభ్యసనశక్తి, చురుకుదనం పెరుగుతోందని డీఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న డీఈఓ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఉపాధ్యాయులు సమకూర్చిన దుప్పట్లను పేద వృద్ధులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విత్తనాల సుధాకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మాంగదరరావు, ఏఈఓలు అవినాశ్, కర్ణ, విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల తనిఖీ

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని ధరణి, మెడ్ విజన్, నిక్కొహెల్త్‌కేర్, తేజస్వీనర్సింగ్‌హోం, మైత్రి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ సారంగం బుధవారం తనిఖీ చేపట్టారు. ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవలకు సంబంధించిన ధరల వివరాలు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ఆస్పత్రి సిబ్బంది వివరాలు, అర్హత సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యులు, సిబ్బంది మారినట్లయితే వెంటనే వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్ష నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు, ఎల్‌డీ కంప్యూటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సేవాలాల్ సేన జిల్లా ప్రచార కార్యదర్శిగా నరేశ్



కురవి: సేవాలాల్ సేన జిల్లా ప్రచార కార్యదర్శిగా మండలంలోని నేరడ శివారు బాల్యతండా గ్రామానికి చెందిన భూక్య నరేశ్ నియమించినట్లు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవనాయక్ తెలిపారు.

దుప్పట్లు పంపిణీ



పెద్దవంగర: మండలంలోని రామచంద్రు తండాలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న చిక్కాల సతీష్ బుధవారం అదే గిరిజన తండాలో 20 మంది వృద్ధులకు దుప్పట్లు, విద్యార్థుకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బుదారపు శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్‌ం ఎర్రోజు విజయ్ కుమార్‌లు, టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సోమారపు ఐలయ్య పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

నెల్లికుదురు: మండలంలోని ఆలేరు ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల కబడ్డీ కోచింగ్ క్యాంపును వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి ఎంఈఓ రాందాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నంద వీరన్న, ఉపాధ్యక్షుడు గందసిరి శ్రీనివాస్, తోట ఏకాంబ్రం, జాయింట్ సెక్రెటరీ గుమ్మల సురేందర్, పీఈటీ ఇమామ్ పాల్గొన్నారు.

సమాజసేవకు పాటుపడాలి

కేసముద్రం: ప్రతీ ఒక్కరు తమవంతుగా సమాజసేవకు పాటుపడాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్‌లో తోడేటి వెంకన్న సహకారంతో రూ.15వేల విలువైన స్టడీమెటీరియల్‌ను పదో తరగతి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మైస శ్రీనివాసులు, అప్పారావు, హెచ్‌ఎం బందెల రాజు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

గంగారం: ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర 9వ మహాసభలు డిసెంబర్ 22, 23న ఐటీడీఏ ఏటూరునాగారంలో జరగనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సువర్ణపాక వెంకటరత్నం బుధవారం తెలిపాడు. తుడుందెబ్బ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.

మెడికల్ షాపుల తనిఖీ

కొత్తగూడ: మండల కేంద్రంలోని పలు మెడికల్ షాపులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఇంటి నంబర్లు ఇవ్వాలి

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ఇంటి నంబర్లు ఇవ్వాలని సీపీఎం నాయకుడు దొంతు సోమన్న, బానాల ఎల్లయ్య, రాజన్న డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మరిపెడలోని ఇందిరానగర్ కాలనీలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, రామస్వామి, ఎల్లమ్మ, జంపయ్య, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలోని రైతువేదికలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సీరోలు మండల వ్యవసాయాధికారి చాయారాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం విత్తనాలు 15కిలోల సంచి రూ.400, ఎంటీయూ1010 రకం విత్తనాలు 25కిలోల సంచి రూ.745లకు ఉన్నాయని తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపురం స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతున్న భూక్య కార్తీక్ పాఠశాల నుంచి బుధవారం తప్పిపోయి స్థానిక చికెన్ సెంటర్ ఉండగా చికెన్ సెంటర్ యజమాని 100కు డయల్ చేశాడు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు ముజాఫర్, గణేశ్ చేరుకొని తండ్రి భూక్య మోహన్‌కు అప్పగించారు.

ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు

గార్ల: కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుల ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ సూర్యప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం గార్లలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్, తనీష్, వరుణ్, అఖిల, భార్గవి పాల్గొన్నారు.

పల్లె దవాఖాన తనిఖీ

పెద్దవంగర: పల్లె దవాఖానా సేవలనుప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి జ్వలిత కోరారు. బుధవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను ఆమె సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు మానస, రాజ్‌కుమార్, ఎన్‌ఎం బూబా, ఆశలు, తదితరులు పాల్గొన్నారు.

అల్పాహార వితరణ

పెద్దవంగర: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం యూపీహెచ్‌సీ డెంటల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మీరాజ్ సాకారంతో విద్యార్థులకు అల్పాహార వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఏదునూరి శ్రీనివాస్ రేణుక పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మహబూబాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో రూ.5లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డు పనులకు కౌన్సిలర్ మహ్మద్ ఫరీద్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మహ్మద్ ఫరీద్, నాగమల్లు, ఉప్పలయ్య, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తి పెంపొందించుకోవాలి

తొర్రూరు: గణిత శాస్త్రంపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య విద్యార్థులకు సూచించారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు అనిల్ కుమార్‌రెడ్డి, కొల్లూరు అశోక్ పాల్గొన్నారు.

నాల్గోరోజుకు చేరిన దీక్ష

కురవి: దళిత రైతు బేతమళ్ల సహదేవ్ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దీక్ష బుధవారం నాటికి నాల్గో రోజుకు చేరింది. దీక్షకు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కోటయ్య, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంమూర్తి, మాలోత్ కిషన్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి సాంబశివరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కురవి: బయ్యారం గ్రామానికి చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి, మహబూబాబాద్‌కు చెందిన నిఖిల్ అనే వ్యక్తి, ఇద్దరు కలిసి బైక్‌పై మహబూబాబాద్ నుంచి బయ్యారం వైపునకు వెళ్తున్నారు. బయ్యారం నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం బంగారుగుడెంతండా వద్ద బైక్‌ను ఢీకొట్టడంతో ఇమ్రాన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

దళిత రైతులకు సాగు భూమి ఇవ్వాలి



మరిపెడ రూరల్: గత ప్రభుత్వం హయాంలో అసైన్‌మెంట్ పట్టాలిచ్చిన దళిత రైతు కుటుంబాలకు సాగు భూమిని గుర్తించి ఇవ్వాలని సీపీఎం మండల నాయకుడు బాణాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మండలంలోని వీరారం గ్రామ దళితులతో కలిసి సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు కొండ ఉప్పలయ్య, బాధిత దళిత రైతులు గంట భద్రయ్య, గంట నాగయ్య, శ్రీనివాస్, ఏర్పుల రవి, దర్శనపు పుల్లయ్య, గుండె వీరయ్య, బాష్పంగు వెంకన్న, మల్లయ్య, వెంకన్న, రాములమ్మ పాల్గొన్నారు.

'ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతాం'

డోర్నకల్: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు తెలిపారు. డోర్నకల్‌లో బుధవారం జరిగిన పార్టీ బూత్ కమిటీ అధ్యక్షుల నియామక సమావేశంలో వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ఏడాది పాలనలో హామీలను అమలు చేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాయమాటలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. బీజేపీ బూత్ అధ్యక్షులుగా ఎన్నికైన వారు పార్టీ ఎదుగుదలకు కృషి చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ ఎన్నికల అధికారి గుగులోతు లక్ష్మణ్, నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ కలువల త్రిలోక్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ ధర్మారపు వెంకన్న, పట్టణ అధ్యక్షుడు గుగులోత్ దేవ్‌సింగ్, మండల అధ్యక్షుడు గణేష్‌నాయక్, జయరాజ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.